సాక్షి
గుంటూరు
బుధవారం । 30 । జులై । 2025



ఆంజనేయుడికి విశేషపూజలు

ఫిరంగిపురం: దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మంగళవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. నాగవల్లీ దళాలతో సహస్రనామ అర్చనలు చేశారు.



సరోగసీ సెంటర్లు పరిశీలన

నరసరావుపేట: డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి జిల్లాలోని ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లను మంగళవారం పరిశీలించారు. ఆయా చోట్ల రికార్డులు పరిశీలించి నివేదికలను తీసుకున్నారు.

నవదుర్గ అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: శ్రావణ మాసం సందర్భంగా భవానీనగర్‌లోని కనక దుర్గమ్మ అమ్మవారు మంగళవారం నవదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆగస్టు 1న 5కే వాక్

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1న 5కిలో మీటర్ల మారథాన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు 5కే వాక్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో 17 నుంచి 25 సంవత్సరాల విద్యార్థులు ప్రతి కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు విద్యార్థినులు పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 7వేలు నగదు అందజేస్తామన్నారు. గోరంట్లలోని చిల్లీస్ వద్ద ఆగస్టు1న ఉదయం 6 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 73823 88088, 98498 54221 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి నాగపంచమి విశేష పూజలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తుల సమక్షంలో అర్చకుడు శంకరమంచి రాజేష్‌శర్మ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేషాలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమరేశ్వరున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజల్లో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై ఘనంగా గరుడ పంచమి



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మంగళవారం గరుడ పంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన జీయర్ స్వామి మంగళ శాసనాలతో ఉదయం 9 గంటలకు గరుత్మంతునికి పంచామృతాలతో అభిషేకం, 10 గంటలకు సంతాన ప్రాప్తి కోసం గరుడ హోమం ఘనంగా నిర్వహించామన్నారు. పద్మావతి అమ్మవారి మాస తిరునక్షత్రం సందర్భంగా అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.

75 త్యాళ్లూరు పీఎంశ్రీ ఉన్నత పాఠశాల జాతికి అంకితం



పెదకూరపాడు: జాతీయ స్థాయిలో పల్నాడు జిల్లాలో ఉత్తమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం 'జాతీయ విద్యా విధానం' ఎన్‌ఈపీ-2020 ఐదో వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మంద్ర ప్రధాన్ జాతికి అంకితం చేయగా స్థానికంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు డీఈఓ ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.రమేష్, ఏఎంఓ పూర్ణచంద్ర రావులు పాల్గొన్నారు.

నేడు శివాలయంలో హుండీ కానుకల లెక్కింపు



పెదకాకాని: శివాలయంలో హుండీ కానుకలు లెక్కింపు కార్యక్రమం బుధవారం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో దేవదాయశాఖ ఆదేశాల మేరకు నియమించిన అధికారి సమక్షంలో ఉదయం 9 గంటలకు హుండీలను తెరిచి కానుకలు లెక్కించడం జరుగుతుందన్నారు. ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన లెక్కింపు కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొంటారన్నారు. కానుకల లెక్కింపులో భక్తులు పాల్గొనవచ్చని తెలిపారు.

మాకు ఓటేస్తే రాష్ట్రవ్యాప్తంగా బస్సుల్లో ఉచితంగా తిరగొచ్చంటూ ఊదరగొట్టారు. అధికారంలోకి రావడమే ఆలస్యం హాయిగా బస్సుల్లో ఇష్టమెచ్చిన చోటకు వెళ్లి రావొచ్చంటూ ఇంటింటికి తిరిగి హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీ అమలుపై ప్రశ్నిస్తే.. అదిగో, ఇదిగో అంటూ ఏడాది కాలం దాటించారు.. ఇప్పుడు ఆగస్టు 15 నుంచి అంటున్నారు. అదీనూ కొన్ని బస్సుల్లోనే.. కొన్ని ప్రాంతాలకే అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. తీరా కాలంతీరి, కండీషన్ అంతంతమాత్రంగా ఉండే అరకొర బస్సులతోనే సరిపెట్టుకోమంటుండడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఉచితానికి బస్సులేవీ!

బస్సుల కొరత.. హామీకి కోత

- మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సవాలక్ష ఆంక్షలు
- రాష్ట్రమంతా తిరగొచ్చని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి నేతలు
- తాజాగా జిల్లావరకే నంటూ సన్నాయి నొక్కులు
- పల్లె వెలుగు, అల్ట్రాడీలక్స్‌లలో మాత్రమే ఉచితమంటూ లీకులు
- రీజియన్ పరిధిలో 215 పల్లె వెలుగు, 41 అల్ట్రాడీలక్స్ బస్సులు మాత్రమే..
- కనీస మార్గదర్శకాలు జారీచేయని రాష్ట్ర ప్రభుత్వం



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కూటమి సర్కారు మరో మోసానికి తెరదీస్తోంది. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల సమయంలో ఇంటింటా ఊదరగొట్టిన కూటమి నేతలు.. తాజాగా జిల్లా వరకు ప్రయాణాలకు మాత్రమే ఉచితమంటూ .. అదీనూ పల్లెవెలుగు, అల్ట్రాడీలక్స్‌లలోనే నంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుండడం మహిళాలోకాన్ని కలవరపెడుతోంది. ఇతర రాష్ట్రాల్లో దాదాపు అన్ని బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తుండగా.. మన రాష్ట్రంలోనే ఎందుకిలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు కూటమి నేతలు ప్రకటిస్తున్నారు.

ప్రతిరోజూ రూ.కోటి ఆదాయం

జిల్లాలో గుంటూరు 1, 2 డిపోలు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలు ఉన్నాయి. రీజియన్ పరిధిలోని ఐదు డిపోలతో పాటు ఏడు నియోజకవర్గాల నుంచి అధికంగా మహిళలు ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ ఆదాయం రోజుకు రూ.కోటి వరకు ఉంటుంది. పండగలు, ఇతర రద్దీ రోజుల్లో రూ 1.25కోట్లు ఆదాయం సమకూరుతుంది. తాజాగా ఉచిత ప్రయాణంలో భాగంగా ఆర్టీసీ ప్రతిరోజు రూ 50 లక్షలకుపైగా ఆదాయం కోల్పోనుంది.



సాక్షి గ్రాండ్ రిపోర్ట్

'పల్లె వెలుగులు' లేవు



గుంటూరు రీజియన్ పరిధిలో మొత్తం 412 బస్సులు ఉన్నాయి. అందులో 97 హైర్ బస్సులు, 215 పల్లె వెలుగు, 41 అల్ట్రాడీలక్స్, 44 సూపర్ లగ్జరీ, 12 ఇంద్ర, 4 అమరావతి స్కానియా ఉన్నాయి. కూటమి గద్దెనెక్కిన తరువాత 2024 సంవత్సరం ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు అని ఊదరగొట్టారు. ఆ తరువాత దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ ఏడాది కాలయాపన చేశారు. నానాటికీ రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోవటంతో మరోసారి ఉచిత బస్సును తెరపైకి తెచ్చారు. మంత్రులు సైతం దీనిపై తలోమాట మాట్లాడుతుండడంపై అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి.

మార్గదర్శకాలు రాలేదు

బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం నుంచి దీనికి సంబంధించిన ఆదేశాలు వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

– డి.సామ్రాజ్యం, ఇన్‌చార్జి ఆర్‌ఎం

మాకు నమ్మకం లేదు



కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ఇస్తుందో లేదో.. ఆ బస్సు ఎక్కిందాక మాకు నమ్మకం లేదు. మహిళలకు ఇచ్చిన ఎన్నో హామీలను విస్మరించారు. బస్సులపై ఏడాదిగా ఇదిగో.. అదిగో అంటూ.. కాలయాపన చేస్తున్నారు. చంద్రబాబు మాటలపై నమ్మకం పోయింది. ఈ సారి ఆగస్టు 15కైనా అమలు చేస్తారో లేదో వేచి చూడాలి.

– మంటి సౌజన్య, గుంటూరు

జిల్లాలో 10 లక్షల మంది



గుంటూరు జిల్లాలో ప్రతిరోజూ లక్ష మందికిపైగా ఆర్టీసీ ద్వారా ప్రయాణం చేస్తున్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అందులో 50 శాతం పైగా మహిళలు ఉండటం విశేషం. గుంటూరు కేంద్రంగా నిత్యం అనేక ప్రాంతాలకు ఉద్యోగినులు, ఆయా పనులు చేసుకునేవారు, వ్యాపారం చేసే మహిళలు నిత్యం ప్రయాణిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగాలు చేసుకునే యువతులు కూడా అధికంగానే ఉన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మహిళలు 1.50లక్షల మంది ఉన్నారు. గుంటూరు పశ్చిమ 1.30లక్షలు, తెనాలి 1.41లక్షలు, పొన్నూరు 1.15లక్షలు, తాడికొండ 1.60లక్షలు, మంగళగిరి 2.03లక్షలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 1.45లక్షల మందికిపైగా ఉన్నారని గణంకాలు చెబుతున్నాయి. సుమారుగా జిల్లాలో 10 లక్షలకుపైగా మహిళలు ఉన్నారు.

కంటి తుడుపుగానే..!

కూటమి ప్రభుత్వం చెబుతున్నదాని ప్రకారం పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ బస్సులు మాత్రమే ఉచిత ప్రయాణానికి కేటాయించారు. వీటిలో రీజియన్ పరిధిలో అల్ట్రాడీలక్స్ బస్సులు 41 మాత్రమే ఉన్నాయి. పదుల సంఖ్యలోని ఆ బస్సుల్లో 10 లక్షల మందిపైగా మహిళలకు ఉచితం దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. ఇక పల్లెవెలుగు బస్సులు 215 మాత్రమే ఉండగా.. లక్షల మంది మహిళలకు ఆ బస్సులు సరిపోవనే చెప్పాలి. పైపెచ్చు పల్లె వెలుగు బస్సులు 100 కి.మీ పరిధిలో తిరగడానికి మాత్రమే ఉద్దేశించినవి కావడంతో ఉచిత ప్రయాణం జిల్లావరకే అనే విషయం తేటతెల్లమవుతోంది. ఏదో మాట ఇచ్చాం కాబట్టి తూతూ మంత్రంగా, కంటితుడుపు చర్యగా ఉచిత ప్రయాణం అమలు చేయబోతున్నారనేది స్పష్టమవుతోంది. ఈమాత్రం దానికి రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల సమయంలో ఇంటింటికి వచ్చి ఎందుకు ఊదరగొట్టారంటూ మహిళలు కూటమి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్

నాణ్యమైన విద్యుత్ అందించండి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్
- నిడుబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న సీఎస్ విజయానంద్

పొన్నూరు: విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. మంగళవారం నిడుబ్రోలు పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో రూ. 58.2 లక్షల ఖర్చుతో చేపట్టిన ఫీడర్ ఆధునికీకరణ పనులను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలసి సీఎస్ పరిశీలించారు. సబ్ స్టేషన్ నుంచి అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ వున్న సర్వీసుల వివరాలు లోడ్, ఏఏ గ్రామాలకు సరఫరా చేస్తున్న వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. సీఎండీ పుల్లారెడ్డి మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వున్న అన్ని ఫీడర్లలో వున్న వ్యవసాయ, వ్యవసాయేతర సర్వీసులు వేరు చేస్తున్న ఫీడర్ బైఫరికేషన్ పనులను మూడు నెలల్లోగా పూర్తి చేసి గ్రామాలకు 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పొన్నూరు మండలంలోని వడ్డిముక్కల గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పూర్తయిందని వ్యవసాయానికి పగటిపూట నిరంతరం 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్‌శాఖ సీజీఎం హెచ్‌ఆర్ డి.లింగమూర్తి, పీడీ టీపీఎస్ఎన్ మూర్తి, టెక్నికల్ డైరెక్టర్ మురళి కృష్ణ యాదవ్, ఈఈలు భాస్కరరావు, మల్లిఖార్జున రావు, రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన కల్పించండి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి




అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై అవగహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులందరికీ బీమా అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మిర్చి, వరి తదితర పంటలు సాగు చేస్తున్న 3,48,933 రైతులకు బ్యాంకర్లు ఇప్పటివరకు రుణాలు మంజూరు చేశారన్నారు. వీరిలో మిర్చి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఈ నెలాఖరులోపు, వరి సాగు చేసే రైతుల వివరాలు వచ్చే నెల 15వ నాటికి బ్యాంకర్లు ఇన్స్యూరెన్స్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పంటల బీమాపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు రైతు సేవా కేంద్రాల ద్వారా బ్యాంకర్లు, అధికారులు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. పంటల బీమా పథకాన్ని పొడిగించేందుకు వ్యవసాయ శాఖాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డుల జారీతోపాటు వ్యవసాయ రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యయసాయాధికారి నాగేశ్వర రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహీపాల్ రెడ్డి, ఉద్యాన శాఖాధికారి రవీందర్, బ్యాంకర్లు, ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు సాయం అందించినవారే

నిజమైన హీరోలు

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ లావు నాగేశ్వరరావు, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య తదితరులు

ప్రత్తిపాడు: ప్రజలకు సాయం అందించనప్పుడే నిజమైన హీరోలుగా గుర్తింపు వస్తుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. ప్రత్తిపాడు మండలం నాగులపాడు బొద్రాయి సెంటరులో మంగళవారం మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ లావు నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి పనులు చేస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. దేశంలో ఎంతో మంది పేదలు ఉన్నారని, మన కుటుంబాలు సంతోషంగా ఉన్నప్పుడు, సమాజం గురించి ఆలోచించాలన్నారు. 37 ఏళ్ల సర్పంచ్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి రాఘవయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ఆళ్ల విజయ్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాట్స్ పూర్వ అధ్యక్షుడు, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం సహకారంతో రూ.13 లక్షలతో నిర్మించిన నూతి సుబ్బారావు – సీతాదేవి డైనింగ్ హాల్‌ను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, నాట్స్ చైర్మన్ పిన్నమనేని ప్రశాంత్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారు బీభత్సం.. నలుగురికి గాయాలు

నరసరావుపేట టౌన్: అతివేగంగా వచ్చిన కారు ఢీకొని ద్విచక్ర వాహనదారులతో పాటు నడిచి వెళ్తున్న బాలికకు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యలమంద గ్రామానికి చెందిన ఎ. మరియదాసు, బూదాల బాబురావులు ద్విచక్ర వాహనంపై ప్రకాష్‌నగర్ సెయింట్ జోసఫ్ స్కూల్ వైపు నుంచి 60 అడుగుల రోడ్డుకు వెళ్తున్నారు. పక్కనే మరో ద్విచక్ర వాహనంపై నవీన్ అనే వ్యక్తి వస్తున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన ఏపీ 11 ఏఎస్ 1638 నంబర్ గల కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొంది. సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కారును వెంబడించటంతో కారు అతివేగంగా రివర్స్ చేస్తూ అప్పుడే ట్యూషన్ నుంచి వస్తున్న బాలిక షేక్ ఆయేషాను ఢీకొట్టింది. సంఘటనలో బాలిక ఎడమ చేయి విరిగింది. క్షతగాత్రులు నలుగురిని ఏరియా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.వి. చరణ్ మంగళవారం తెలిపారు. కారు నడిపిన నిందితుడు పట్టణానికి చెందిన మైనర్ బాలుడు షేక్ సుభానిగా గుర్తించారు. మైనర్‌కు కారు నడిపేందుకు ఇచ్చిన ఓనర్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,200 గరిష్ఠం : రూ. 1,700

మోడల్ ధర రూ. 1,400

మిర్చి యార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	52,870
అమ్మకాలు	51,233
నిల్వ	8,308

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,200
నంబరు–5	10,000–13,300
341	10,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,600
నంబరు–5	10,000–13,400
341	10,000–13,600
4884	10,000–12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 12,800
దేవనూరు డీలక్స్	10,000 – 12,400
ఆర్మూర్	9,600 – 11,000
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,800
బాడిగ – 355	10,000–12,400
దేవనూరు డీలక్స్	10,000–12,600
తాలు	5,300 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం



నరసరావుపేట ఈస్ట్: మండలంలోని గురవాయిపాలెం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నాగరవీంద్ర అంతర్జాతీయస్థాయి పరుగు పందెంలో సత్తా చాటాడు. నేపాల్ దేశంలోని పోఖ్రాలో నిర్వహించిన ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ – 2025 అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి అంతర్జాతీయ వేదికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు. ఈనెల 24వ తేదీ నుంచి 28 వరకు యూత్ అండ్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించినట్టు నాగరవీంద్ర సోమవారం తెలిపారు. నాగరవీంద్ర నాగార్జున సాగర్‌లోని ఏపీ రెసిడెన్షియల్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కర్నూలుకు చెందిన కోచ్ షేక్ ఫయాజ్ ప్రోత్సాహంతో గతంలోనూ విశాఖపట్నం, గోవాలలో నిర్వహించిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఉద్యోగుల ప్రయోజనాలు సాధించేందుకు రాజీపడం

- ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్
- గుంటూరులో ఏపీ ఎన్జీజీఓ సాంస్కృతిక భవనం ప్రారంభం



సాంస్కృతిక సమావేశ భవన ప్రారంభోత్సవంలో అలపర్తి విద్యాసాగర్ తదితరులు

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను సాధించేందుకు ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడబోమని ఏపీ ఎన్జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం గుంటూరులో గుంటూరు వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఏపీ ఎన్జీజీవో సంఘ సాంస్కృతిక సమావేశ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరండర్ లీవ్ బకాయిలు కొంత మేరకు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. మిగిలిన వాటిని చెల్లించేందుకు రాష్ట్ర నాయకులతో కృషి చేస్తుందని తెలిపారు. గుంటూరులో ఎన్జీవో ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారని అభినందించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో కూడా ఎన్జీవో ప్రాంగణాలను ఉద్యోగులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాలకు గుంటూరు జిల్లా మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు.

ఏపీ ఎన్జీజీఓ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ మాట్లాడుతూ ఉద్యోగ నాయకుల సమష్టి కృషితో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు సాధించుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి, రామ్‌ప్రసాద్, రంజిత్‌నాయుడు, తదితరులు మాట్లాడారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో నూతన సాంస్కృతిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ గుంటూరు నగర అధ్యక్షుడు సూరి, కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, సంఘ నేతలు సత్యనారాయణరెడ్డి, శరత్‌బాబు, కృష్ణారెడ్డి, రామకృష్ణ, రాంబాబు, జానీబాషా, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, సుకుమార్, శ్రీవాణి, విజయలక్ష్మి, శివజ్యోతి, రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కృషి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో పర్యావరణ పరిరక్షణ పెంపొందించేందుకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గాలి నాణ్యతను మరింతగా పెంపొందించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు నిర్వహించేందుకు సంబంధిత శాఖలు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మిని సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీఎంసీ పరిధిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను జిల్లా స్థాయి అమలు కమిటీలు నిర్వహించాలన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు నగరానికి 2011–15 మధ్య గాలి నాణ్యతా డేటా ఆధారంగా నాన్ అసైన్‌మెంట్ నగరాల్లో ఒకటిగా గుర్తించిందన్నారు. జాతీయ కాలుష్యాన్ని గుర్తించేందుకు జాతీయ క్లీన్‌ఎయిర్ ప్రోగ్రామ్‌ను రూపొందించారని పేర్కొన్నారు. రానున్న పది సంవత్సరాల్లో గాలిలో కాలుష్యాన్ని 70 నుంచి 80 శాతం తగ్గించే లక్ష్యంతో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనిలో భాగంగా 2019–20, 2024–25 వరకు గుంటూరు నగరానికి మొత్తం ఎన్‌సీ ఏపీ కింద రూ. 20.51 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి క్లీన్ సిటీ రూ.2.73 కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన పనులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలన్నారు. గాలి నాణ్యతా ప్రమాణాలు పెంపొందించేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. శంకర్ విలాస్ బ్రిడ్జి కూల్చడం, నూతన బ్రిడ్జి నిర్మాణ క్రమంలో జీజీహెచ్, ట్రావెల్స్ బంగ్లాలో వద్ద ఉన్న నేషనల్ ఎయిర్ మానిటరింగ్ ప్రోగ్రామ్ ద్వారా ఏర్పాటు చేసిన స్టేషన్‌లను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మార్చాలన్నారు. సమావేశంలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఎం.డి.నజీనా బేగం, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, డీఎస్ ఆర్.చంద్రమౌళి పాల్గొన్నారు.

రైల్వే సిగ్నల్ కంట్రోలు కార్యాలయం ప్రారంభం



దుగ్గిరాల: నూతన కార్యాలయంలో మంగళవారం రైల్వే సిగ్నల్ కంట్రోలు వ్యవస్థను రైల్వే ఉన్నతాధికారులు ప్రారంభించారు. సుమారు మూడు సంవత్సరాలు నుంచి ఆధునీకరణ పనులు వాటితో పాటు 3వ లైను నిర్మాణ జరుగుతుంది. పనులు పూర్తి కావడంతో అత్యంత ఆధునిక సాంకేతిక విధానం కలిగిన కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

సమన్వయంతో పనిచేస్తే ప్రమాదాల నివారణ

- పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- జిల్లా ఎస్పీతో కలిసి 'డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ' సమావేశం నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలైన రెవెన్యూ, రవాణా, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో 'డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ' సమావేశానికి కలెక్టర్ చైర్మన్ హోదాలో హాజరై, ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత డిపార్టుమెంట్ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని, ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చూడాలని కోరారు. యూ టర్న్ దగ్గర సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రొంపిచర్ల వద్ద హైవేపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం నోడల్ అధికారి ఈ-డార్ యాప్ పై అవగాహన కల్పించారు. ఆర్టీఓ వి.సంజీవ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ, ఆర్టీసీ ఆర్.ఎం, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

గంజాయి హాట్‌స్పాట్లపై నిఘా పెట్టండి..

నరసరావుపేట: జిల్లావ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, మాదక ద్రవ్యాల కార్యకలాపాల్లో ఉన్న అనుమానితుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లా మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో అసంపూర్తిగా నిర్మించిన భవనాలు, ఖాళీగా వదిలివేసిన భవనాలలో కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదై, గంజాయి సరఫరా చేస్తూ, అమ్ముతూ దొరికిన వారి ఆస్తులు జప్తు చేస్తామన్నారు. మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు స్కూళ్లస్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు అన్ని విద్యా సంస్థలలో ఈగిల్ క్లబ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. డీ–అడిక్షన్ సెంటర్లు పునరావాస సహాయం కోసం అవుట్‌రీచ్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కలువ రవీంద్ర, డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.ప్రసూన, సైకియాట్రిస్ట్ డీజీపీఎస్ రాజు, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమాధికారి ఎం.ఉమాదేవి, డీపీఓ ఎస్వి.నాగేశ్వర నాయక్, డీసీజీఎస్‌డబ్ల్యూఎస్ ఏపీ గోపిరెడ్డి, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సాంకేతిక పరిజ్ఞానం కీలకం

జెడ్పీ సీఈఓ జ్యోతిబసు



శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ జ్యోతిబసు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసే క్రమంలో అవసరమైన డేటాను రూపొందించడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కార్యాచరణ ప్రణాళిక 2025–26 రూపకల్పనలో భాగంగా ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్, ప్రగతి పోర్టల్‌పై మండల స్థాయిలోని సాంకేతిక సిబ్బందికి శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ టీఎంపీ, ప్రగతి పోర్టల్, ప్రగతి యాప్ వినియోగించే పద్ధతి, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణకు సంబంధించిన అంశాలను పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించడంలో సాంకేతికపరమైన పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పోస్ట్, ప్రీ అసెస్‌మెంట్, ఆధార్ ఆథెంటిఫికేషన్, ఈ–సర్టిఫికెట్ డౌన్‌లోడ్ వంటి అంశాలను పూర్తి చేసేందుకు ప్రతి ఉద్యోగికి శిక్షణ కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు రవీంద్రబాబు, కె.నాగేశ్వరరావు, కరీముద్దీన్, అనురాధ, ఏవో ప్రతాప్ పాల్గొన్నారు.

ఖైదీలకు క్షయ వ్యాధిపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ దాసరి శ్రీనివాసులు, పక్కన జిల్లా జైలు అధికారులు

గుంటూరు మెడికల్: టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంటూరులోని జిల్లా జైలులో 250 మంది ఖైదీలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, దగ్గినప్పుడు కళ్లెతోపాటు రక్తం పడడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా భావించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని, నిర్ణీత కాల వ్యవధి ఉన్న మందుల కోర్సు వాడడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు అన్నారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాపిస్తుందని, దగ్గే సమయంలో నోటికి కర్చీఫ్ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎ.బి.శాంతరాజు, వైద్య అధికారిణి డాక్టర్ లక్ష్మీసుధ, సిబ్బంది నాగజ్యోతి, స్వరూప, రాంబాబు, సాంబశివరావు, నాగమణి, సంధ్యారాణి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మద్యం అమ్మకందారులు

- 80కి పైగా మద్యం బాటిళ్లు దొరికినట్లు సమాచారం
- 49 సీసాల మద్యం పట్టుకున్నట్లు కేసు నమోదు చేసిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: 'మద్యం మత్తులో యువకుల ఘర్షణ' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. తాడికొండలోని మద్యం దుకాణంలో రాత్రి వేళ అమ్మకాలు చేస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి దాదాపు 80కి పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే 49 మద్యం సీసాలు మాత్రమే పట్టుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంతా జరుగుతున్నా పోలీసులు స్పందించారే తప్ప ఎక్సైజ్ అధికారులు అటుగా తొంగి చూడకపోవడం విశేషం.

ఉన్నపళంగా పొమ్మంటే ఎలాగయ్యా!



గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలతో జీఎంసీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నల్లపాడు చెరువు కట్ట నివాసితులు

- స్థలాలు చూపించి మా ఇళ్లు పడగొట్టండి
- నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నల్లపాడు చెరువు కట్ట నివాసితుల ఆందోళన



అధికారులు ఇచ్చిన నోటీసు

నెహ్రూనగర్: అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని.. ఇప్పుడు ఉన్న పళంగా నోటీసులు ఇళ్లు ఖాళీ చేయాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన స్థలాలను చూపించి.. మా ఇళ్లను పడగొట్టండి అంటూ నల్లపాడు చెరువు కట్ట నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నల్లపాడు చెరువు కట్ట నివాసితులు ఆందోళన నిర్వహించారు. తమ గోడు విన్నవించుకునేందుకు వస్తే అధికారులు తమపై మండిపడుతూ, బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూకుమ్మడి ఆత్మహత్యలే గతి

18 సంవత్సరాలకు పైబడి ఊరికి దూరంగా కనీస మౌలిక వసతులు లేకపోయినప్పటికీ, రూ.వేల అద్దెలు చెల్లించే స్థోమత లేక చిన్న ఇళ్లు నిర్మించుకుని కూలీ పనులు చేసుకుంటూ తాము జీవిస్తున్నామని, ఆ ఇళ్లను ఖాళీ చేయాలంటూ జీఎంసీ అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారని వాపోయారు. ఇళ్లు ఖాళీ చేయడంలో తమకు అభ్యంతరం లేదని.. కానీ గత ప్రభుత్వ హయాంలో కొర్నెపాడు దగ్గర ఇచ్చిన స్థలాలను తమకు చూపించి ఇళ్లు తొలగించాలని వారు ప్రాధేయపడ్డారు. ఉన్న ఫలంగా మమ్మల్ని ఖాళీ చేయాలని ఆదేశిస్తే ఎక్కడికి వెళ్లి బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయం చూపకుండా తమ ఇళ్లను తొలగించాలని చూస్తే మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప తమకు గత్యంతరం లేదని వాపోయారు.

టిడ్కో ఇళ్లలో నివాసం కల్పించాలి

ప్రస్తుతం కొర్నెపాడులో తమకు ఇచ్చిన స్థలాల్లో రైతులు పంట పండిస్తున్నారని.. అవి తమకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని.. అడవి తక్కెళ్లపాడు, వెంగళాయపాలెంలలో ఖాళీగా ఉన్న టిడ్కో ఇళ్లలో తమకు నివాసం ఉండేందుకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అంగలకుదురు విద్యార్థుల సత్తా



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెనాలిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 60 కిలోల విభాగంలో బి.దివ్య, 70 కిలోల విభాగంలో జి.అఖిల, 105 కిలోల విభాగంలో ఎం.బాలాజీ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అలానే 83 కిలోల విభాగంలో టి.హేమచంద్, 90 కిలోల విభాగంలో వై. శ్రీశశాంక్ తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వ్యాయామోపాధ్యాయులు వేమూరి శరత్‌బాబు, పులివర్తి రాజులను పాఠశాల హెచ్ఎం ఎస్.అనురాధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం అభినందించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి పలు పథకాలు

నరసరావుపేట: మాజీ సైనికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించటం జరుగుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ అధికారి గుణశీల పేర్కొన్నారు. మంగళవారం పాతూరులోని ఓ హోటల్ ఆవరణలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమసంఘం ప్రతినిధులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సైనికులకు కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంసెట్, మెడికల్‌లో ప్రవేశం పొందిన మాజీ సైనికుల పిల్లలకు రూ.10వేల వరకు సహాయం చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన వారి పిల్లలకు ఆర్థికసాయం చేస్తున్నామన్నారు.

యోగా పోటీల్లో సత్తా చాటాలి



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు



గరుడాసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

- మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీలో దక్షిణ భారత యోగా ప్రదర్శన పోటీలు ప్రారంభం
- ఐదు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జాతీయస్థాయి యోగా ప్రదర్శన పోటీల్లో పతకాల సాధనే లక్ష్యంగా క్రీడాకారులు కృషి చేయాలని చిలకలూరిపేట పురపాలక కమిషనర్ పి.శ్రీహరిబాబు చెప్పారు. చిలకలూరిపేట మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం మంగళవారం యోగా క్రీడాకారులతో కళకళ లాడింది. జేఎన్‌వీ పరిధిలో జరిగే ప్రాంతీయస్థాయి యోగా ప్రదర్శన పోటీలకు మద్దిరాల నవోదయ విద్యాలయం వేదికగా నిలిచింది. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఇటీవల జరిగిన క్లస్టర్ స్థాయి యోగా పోటీల్లో విజేతలు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

తరలివచ్చిన 278 మంది విద్యార్థులు

29వ తేదీ నుంచి వరుసగా మూడు రోజులు పాటు పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం ఐదు రాష్ట్రాలకు చెందిన 278 మంది క్రీడాకారులు, తమ పీఈటీలు, ఎస్కార్ట్‌లతో తరలివచ్చారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి యోగా ప్రదర్శన పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అట్టహాసంగా ప్రారంభమైన ఈ పోటీలకు అధ్యక్షత వహించిన విద్యాలయ ప్రిన్సిపాల్ ఎన్.నరసింహారావు స్వాగతోపన్యాసం చేశారు. ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ లింగయ్య చౌదరి, నవోదయ విశ్రాంత సహాయ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జేఎన్‌వీల విద్యార్థులు యోగా ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో జేఎన్‌వీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 87907 41166

WANTED

■ గుంటూరు ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ వారి CRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్స్ & ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. మంచి కమీషన్ + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 98498 86249

■ గుంటూరు ఆటోనగర్, పుల్లడిగుంట, నల్లపాడు, చిన్నపలకలూరు, పేరేచర్ల లలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచిజీతం. సంప్రదించండి. 73867 43 664

■ ప్రముఖ MR సోలార్ సిస్టమ్స్ నందు ఫీల్డ్ వర్క్ చేయుటకు మార్కెటింగ్ రిప్రజెంటేటివ్స్ కావలెను. అ: 10th ఆపైన, ఆకర్షణీయమైన జీతం. 9533661044, 9573530301

■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూప బడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18–28సం॥లోపు. 9133444988/ 89

■ Required Electronic goods procurement field executives from all Electronic stores. contact: 91333 99257

■ కేర్ టేకర్స్ వర్కర్లు కావలెను. విజయవాడలోని ప్రముఖ హోమ్‌కేర్ సర్వీసెస్‌లో ఇంటివద్దనే వుండి పెద్ద వారిని చూసుకొనుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. మంచి జీతం ✆ 91608 35559, 99121 15559

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 16-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959021122, 9949021122

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ఈ ఎడిషన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి గుంటూరు 7075167663 7075167541

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఉచితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే టోల్ ఫ్రీ నెంబర్ల విషయంలో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

